క్లుప్తంగా

ఈ నెల 18న తైబజార్ వేలం

మద్దూరు: పట్టణంలో ప్రతి గురువారం నిర్వహించే సంతబజార్, పశువుల సంత వేలంను ఈ నెల 18న మద్దూరు శివారులోని రైతు వేదిక వద్ద ఉదయం 11గంటలకు నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి రామునాయక్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 12న నిర్వహించాల్సిన వేలాన్ని పాటదారుల అభ్యంతరంతో వాయిదా వేసినట్లు తెలిపారు. గతంలో వేలం పాట కోసం దరఖాస్తు చేసుకున్న వారు 37మంది ఈ వేలం పాటలో పాల్గొనాలని సూచించారు. పంచాయతీ నిబంధనల మేరకు ఈ నెల 18 నుంచి వచ్చే ఏడాది మార్చి 31వరకు మాత్రమే ఈ వేలం ఉంటుందని పేర్కొన్నారు.

అదనంగా బస్సుసర్వీసు వేయాలి



మరికల్: ఆర్టీసీ బస్సుల కొరత కారణంగా మరికల్, ఆత్మకూర్ మధ్యన రాను పోను రెండు బస్సులు మాత్రమే నడిపించడంతో ప్రయాణికులు, పాఠశాలకు వచ్చే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వనపర్తి డిపోకు చెందిన రెండు బస్సులను నడిపించడంతో రాను, పోను ఈ రెండు బస్సులు మాత్రమే రాకపోకలను సాగించడంతో విద్యార్థులు సకాలంలో పాఠశాలకు చేరుకోలేకపోతున్నారు. ఈ సమయంలో ప్రైవేట్ వాహనాల్లో తరలి వెళ్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని నారాయణపేట డిపోనుంచి మరో రెండు బస్సులను అదనంగా వేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

క్రీడాకారుడికి ఆర్థిక సాయం



మాగనూర్: మండల పరిధిలోని కొల్పూర్ గ్రామానికి చెందిన వికలాంగుడైన లింగప్ప అథ్లెటిక్స్ రాష్ట్రస్థాయి 200, 400 మీటర్ల ఈ వెంట్‌లో పాల్గొన్నాడు. వరంగల్ జిల్లా హన్మకొండలో జరిగే అథ్లెటిక్స్‌కోసం వెళ్తున్న సందర్భంగా ఆర్థిక ఇబ్బందులు ఉండటంతో విషయం తెలుసుకున్న బీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి తల్లిదండ్రులు లింగప్పకు ఆర్థిక సాయం అందజేశారు. వారు మాట్లాడుతూ.. గ్రామీణ క్రీడాకారులు క్రీడాలో రాణించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు.

వెలగని హైమాస్ట్ లైట్లు



అమరచింత: మండలంలోని కిష్టంపల్లి ఎక్స్‌రోడ్‌లో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు వెలగడం లేదు. ఇందిరాగాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ఈ లైట్లు కొన్ని నెలలుగా వరిగిపోతు కిందపడుతున్న వాటిని తొలగించడంలో విఫలమవుతున్నారు. రాత్రి వేళలో వెలుతురు ఉండేలా లైట్లను పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పాఠశాలలో మద్యం సీసాలు !

మాగనూర్: మండల పరిధిలోని వర్కూర్ మండల పరిషత్ పాఠశాల మందుబాబులకు అడ్డాగా మారింది. పాఠశాల ఆవరణలో మందుబాబులు తాగి ఖాళీ సీసాలు, ఆహార పదార్థాల వ్యర్థాలు పడేసి వెళ్తున్నారు. దీంతో ఉదయం పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఖాళీ మద్యం సీసాలు దర్శనమివ్వడంతో ఆశ్చర్యపోయారు. ఈ విషయంపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు పటిష్ట చర్యలు తీసుకుని మందుబాబుల ఆగడాలను అరికట్టాలని స్థానికులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.



చెరువు మరమ్మతు ఎప్పుడో?

- కట్ట తెగేవరకు స్పందించరా
- పేరుకుపోయిన చెత్తాచెదారం
- కట్ట నిండా ముళ్లకంప
- పట్టించుకోని అధికారులు



మరమ్మతుకు నోచుకోని పెద్ద చెరువు తూము (ఫైల్)

మాగనూర్: మండలంలోని గ్రామ పెద్ద చెరువు కట్ట కోతకు గురైందేకు సిద్ధంగా ఉంది. వర్షాకాలం భారీ వర్షాలు కురిస్తే కట్ట తెగిపోయే ప్రమాదం ఉంది. చెరువు కట్ట కింద పొలాలకు నీరందించే పంట కాల్వలకు మరమ్మతులు లేకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. చెరువుల కింద సిమెంట్ కాల్వలు నిర్మించాలని దశాబ్దాల కాలంగా అధికారులకు మొరపెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. బోర్లపై ఆధారపడుతూ వరి, కంది, పత్తి, వేరుశనగ పంటలు సాగు చేస్తున్నారు. వానలు పడితే చెరువులు, వాగులు నిండుతున్నాయి. మాగనూర్ పెద్ద చెరువుకు సంబంధించిన కాల్వలకు మరమ్మతులు చేయకపోవడంతో పంటలకు నీరందడం లేదు.

నిర్లక్ష్యపు నీడలో చెరువు, కుంటలు..

వర్షాకాలంలో చెరువు, కుంటలు జలకళ సంతరించుకున్నాయి. గత రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో మిషన్ కాకతీయ పథకం పేరుతో చెరువు పునరుద్ధరణ చేపట్టింది. ఇది సత్ఫలితాలు ఇచ్చింది. ఆ తర్వాత వాటిని పట్టించుకోకపోవడంతో చెరువులు యథాస్థితికి వచ్చాయి. పునరుద్ధరణ చేపట్టిన పూడికతీత పనులు నీటి సామర్థ్యాన్ని పెంచాయి. ప్రస్తుతం నిర్వహణపై దృష్టి సారించకపోడంతో నిర్లక్ష్యపు నీడలో మగ్గిపోతున్నాయి.

పంట కాల్వలు నిర్మణమెప్పుడో..

మండలంలో మొత్తం చెరువులు, కుంటలు 63 ఉన్నాయి. చెరువుల కింద మూడువేల ఎకరాలు, ఆయాకట్టు భూమి ఉంది. చెరువుల నుంచి పంటలకు నీళ్లు పారాలంటే తప్పనిసరిగా సిమెంట్ కాల్వలు నిర్మించి ఉండాలి. చాలా చెరువుల కింద పంట కాల్వల నిర్మాణాలు పట్టించుకోవడం లేదు. మాగనూర్ చెరువు విస్తీర్ణం 41.17 క్యూబిక్ మీటర్లు అయితే చెరువు కింద 329 ఎకరాల్లో చెరువు నుంచి నీరు అందించాల్సి ఉండగా దాదాపుగా 150ఎకరాలకు పైగా చెరువు నీరందడం లేదు. ఉన్న వాటిలో మట్టికాల్వలు ముళ్ల కంపలతో మూసుకుపోగా.. నీళ్లు పంటలకు పారడం లేదు. పక్కనే పుష్కలంగా నీళ్లున్నా పంటలకు పారబెట్టుకోలేని దుస్థితి నెలకొంది.

ముళ్లపొదలు తీసే వారేరి..

మండల వ్యాప్తంగా ఉన్న చెరువులు కుంటలపై మిషన్ కాకతీయ పథకం ద్వారా చెరువుల నిర్వహణపై దృష్టిసారించే వారే లేకుండా పోయారు. చెరువు కట్టపై ముళ్లపొదలు పెరగడంతో కంపచెట్లు తొలగించాలని ఆయా కట్టుదారులు కోరుతున్నారు.

సిమెంట్ కాల్వలు నిర్మించాలి..



చెరువు నీటిపైనే మండలంలోని అనేక గ్రామాల రైతులు ఆయా కట్టు కింద పంటలు సాగు చేస్తున్నారు. చెరువులో నీళ్లు ఉన్న కాల్వలు మూసుకుపోవడంతో చాలా మంది రైతుల పంటలకు నీళ్లు పారడం లేదు. ప్రభుత్వం స్పందించి పంట కాల్వలు నిర్మించాలి.

– మారెప్ప, రైతు మాగనూర్

మరమ్మతు చేయాలి..



మాగనూర్ చెరువు కట్ట కోతకు గురయ్యే అవకాశాలున్నాయి. ఏడాదిలో భారీ వర్షాలు కురిస్తే కట్ట తెగే ప్రమాదం ఉంది. జూన్ చివరిలోగా మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేసి చెరువు, పంట కాల్వలకు మరమ్మతులు చేపట్టాలి.

– ఆంజనేయులు, మాగనూర్ రైతు

ప్రతిపాదనలు పంపిస్తాం..

చెరువులు, కుంటలు భారీ వర్షాలకు కోతకు గురైన మాట వాస్తవమే. ఎక్కడెక్కడ నిర్మించాలనేది ప్రభుత్వానికి త్వరలో ప్రతిపాదనలు పంపిస్తాం. రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే కోతకు గురైన చెరువు, కుంటలకు మరమ్మతు చేపడుతాం.

– అహ్మద్, ఇరిగేషన్ ఏఈ, మాగనూర్

తాగునీటి కోసం తంటాలు



మాగనూర్: మండల పరిధిలోని వర్కూర్‌లో గత ఐదురోజుగా తీవ్రంగా తాగునీటి ఎద్దడి నెలకొందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో నీటి ఎద్దడి ఉందని అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా గ్రామంలో మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడం కూడా పెద్ద సమస్యగా మారింది. గతంలో వీజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామానికి వాగునుంచి తాగునీటి పైపులైన్ వేసిన నిర్వహణ లోపంతో అవి కూడా సరఫరా కావడం లేదు. వర్షకాలం మొదలైన ఇంకా తాగునీటి కోసం తంటాలు తప్పడం లేదని, సంబంధిత అధికారులు స్పందించి గ్రామానికి తాగునీటి సమస్య తీర్చాలని కోరుతున్నారు.

అసంపూర్తిగా పాఠశాల భవనం



ఎస్సీకాలనీలో పాఠశాల భవనం

ఆత్మకూర్: మున్సిపాలిటీ పరిధిలోని ఎస్సీకాలనీలో ప్రభుత్వ పాఠశాల భవనం మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా పాతభవనాన్నికూల్చి వేసి బేస్‌మెంట్ వరకు పనులు చేసి వదిలేశారు. ఏడాది దాటినా పనులు ముందుకు సాగకపోవడంతో చిన్న గదుల్లోనే విద్యాబోధనలు ఇబ్బందికరంగా మారాయి. ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు స్పందించి అదనపు తరగతిగదుల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

కూరగాయల ధరలకు రెక్కలు

కోస్గి: కూరగాయల ధరలు పట్టపగలే చుక్కలు చూపుతున్నాయి. వామ్మో కూరగాయలు గింత ధరనా..? అంటూ సంతలో కూరగాయల ధరలను చూసి జనం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఆదివారం జరిగే వారంతపు సంతలో కూరగాయలు, ఆకుకూరల ధరలు దిగి రాకపోవడంతో సామాన్య జనం అంగడి ఖర్చులు భరించలేక ఆగమాగమవుతున్నారు. వానాకాలంలోనూ ధరలు మండుతుండటంతో సామాన్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం కోస్గి వారంతపు సంతలో పచ్చిమిర్చి కిలో రూ.120 కాగా టమాటాలు, వంకాయ, బంగాళదుంప, బెండకాయ, బీరకాయ, దొండకాయకిలో ధర రూ.80లకు అమ్మారు. పాలకూర, తోటకూర, కొత్తిమిర తదితర ఆకుకూరలు సైతం అదే దారిలో ఉన్నాయి. ధరలు పెరగడంతో సామాన్యులు ఏం కొనాలో? ఏం తినాలో..? అనే చందంగా కాలం వెళ్లదీస్తున్నారు.

అందుబాటులో విత్తనాలు

కోస్గి: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రైతులకు అవసరమైన వరి విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు పీఏసీఎస్ చైర్మన్ భీంరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర మేరకు 25 కిలోల వరి–1010 రకం బస్తా ధర రూ.995లకు, కేఎన్‌ఎం–118 రకం బస్తా ధర రూ.995లకు విక్రయిస్తున్నామన్నారు. వరి విత్తనాలు కావాల్సిన రైతులు భూమి పట్టా పాస్ బుక్, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో వచ్చి కార్యాలయం నుంచి పొందవచ్చునన్నారు.

25న దుకాణాల అద్దెకు వేలం

నారాయణపేట: కలెక్టర్, జిల్లా స్పోర్ట్స్‌చైర్మన్ ఆదేశానుసారం జిల్లా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని మక్తల్ మినీ స్టేడియంలోని ఆరు దుకాణాలను అద్దెకిచ్చేందుకు ఈ నెల 25న ఒపెన్ వేలం వేయడం జరుగుతుందని జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి శెట్టి వెంకటేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దుకాణ సముదాయలను అద్దెకు కావాల్సిన వారు రూ. 5వేలు డీవైఎస్‌ఓ నారాయణపేట గారి పేరు మీద డిమాండ్ డ్రాఫ్ట్ తీసి రసీదును ఈ నెల 22 వరకు డీవైఎస్ ఓ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. ఎమైనా సందేహాలు ఉంటే ఈ సెల్‌నంబర్‌ను 9490409900 సంప్రదించాలని కోరారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

మక్తల్: బక్రీద్ పండగ సందర్భంగా పట్టణంలోని ఆదివారం పేదలకు నిత్యావసర సరకులను జిల్లా మత్స్యకార సంఘం మాజీ చైర్మన్ ఎంపీటీసీ కోళ్ల వెంకటేష్ చేతుల మీదుగా అందజేశారు. బక్రీద్‌ను శాంతియుత వాతావారణంలో పండగను నిర్వహించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకుడు రహీం పటేల్ తదితరులు పాల్గొన్నారు.



గుంతల రోడ్లతో ఇబ్బందులు

ఆత్మకూర్: మున్సిపాలిటీ కేంద్రంలోని వీధుల్లో రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. పది వార్డుల్లో పరిస్థితి ఇలాగే ఉండడంతో స్థానికులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక గాంధీచౌక్‌లో వర్షపునీరు భారీగా చేరడంతో వాహనదారులు నీళ్లలో పడిపోతున్నారు. సీసీ రోడ్ల పనులు పూర్తికాకపోవడం, గాంధీచౌక్‌లో డ్రెయినేజీ వద్ద కల్వర్టు నిర్మించక పోవడంతోనే సమస్యలు తలెత్తుతున్నాయి. గుంతలమయమైన రోడ్డును బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



గాంధీచౌక్‌లో పూర్తిగా దెబ్బతిన్న రోడ్డు



అమరచింత వైపు వెళ్లే రోడ్డు దుస్థితి

సాగని రహదారి పనులు

- 4 కిలోమీటర్ల రహదారికి రూ.3.50 కోట్లు
- కచ్చ రహదారితో అమరచింత –మూలమళ్ల రైతుల ఇక్కట్లు



అమరచింత నుంచి మూలమళ్ల వెళ్లే రహదారి (ఫైల్)

అమరచింత: ఐదేళ్ల కిందట అమరచింత–మూలమళ్ల వరకు ఉన్న కచ్చ రహదారికి బీటీ కోసం నిధులు మంజూరైన ఇప్పటికి పనులు మాత్రం ముందుకు సాగలేకపోతున్నాయి. నాలుగు కిలోమీటర్ల మేరకు బీటీ వేయడానికి ప్రభుత్వం రూ.3.50కోట్లు మంజూరు చేసింది. పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ ఇప్పటి వరకు పనులను చేపట్టకపోవడంతో ఇరు గ్రామాల ప్రజలు, రైతులు వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పండించిన వరిధాన్యం మార్కెట్‌కు తరలించే యత్నంలో కచ్చ రహదారిపై వెళ్లలేని పరిస్థితి దాపరించాయి. అమరచింత పట్టణం నుంచి మూలమళ్లకు వెళ్తున్న ఈ రహదారిపై జూరాల ప్రాజెక్టుకు వెళ్తున్న వాహనాలు, పర్యాటకులు సైతం ఇదే రహదారిపై ప్రయాణం చేస్తుంటారని, బీటీ పనులు వెంటనే చేపట్టాలని పలుమార్లు పీజేపీ అధికారులకు విన్నవించినప్పటికి పనులలో కదలికలు లేకపోవడం దారుణమని ఆయా గ్రామాల రైతులు తెలిపారు.

కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చాం

బీటీ రహదారి పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు పలుమార్లు నోటీసులు అందించాం. సుమారు ఐదేళ్ల కాలం దాటుతున్న పనులు చేయకపోవడంకేమిటని ఇలా పనులు చేపట్టకపోతే బ్లాక్ లీస్ట్‌లో ఉంచుతామని హెచ్చరించాం. త్వరగా పనులు పూర్తి చేసి ఇరుగ్రామాల ప్రజలు, రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాస్, జేఈ పీజేపీ నందిమళ్ల డివిజన్

గోవులను వధించే వారిని శిక్షించండి



మరికల్‌లో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

మక్తల్: దేశంలోని హిందువులంతా ఆరాధ్యదైవంగా పూజించే గోమాతను వధించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వీహెచ్‌పీ పట్టణ అధ్యక్షుడు వాకిటి భీమన్నతోపాటు పలువురు నాయకులు ఆదివారం స్థానిక సీఐ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. బక్రీద్ పండుగ సందర్భంగా యథేచ్ఛగా గోవులను తరలించి చంపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోనూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని సీఐ దృష్టికి తీసుకెళ్లారు. మండలంలో ప్రత్యేకంగా దృష్టి సారించి గోవధకు పాల్పడుతున్న వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు పసుపుల భీమేష్, రాహుల్, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

మరికల్: మన సంప్రదాయం ప్రకారం గోమాతను పూజిచండం మన ధర్మమని ఎస్ఐ మురళి అన్నారు. మండలంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ముస్లిం పెద్దలు, విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ కార్యకర్తలతో పీస్ కమిటీ సమావేశం ఏర్పాటుచేశారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. బక్రీద్ పండగా సందర్భంగా శాంతియుత వాతావారణంలో పండగను నిర్వహించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ కార్యకర్తలతోపాటు ముస్లింలు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల బహూకరణ



పుస్తకాలను అందిస్తున్న పాటూరు శ్రీనివాసులు

నారాయణపేట రూరల్ : మండలంలోని జాజాపూర్‌లో నిర్వహిస్తున్న సర్వోదయ గ్రామీణ గ్రంథాలయానికి పలు రకాల పుస్తకాలను బహుకరించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో లైబ్రేరియన్‌గా విధులు నిర్వహిస్తున్న పాటూరు శ్రీనివాసులు, ప్రదీప్‌లు సుమారు రూ.లక్ష విలువ చేసే వారి సొంత డబ్బులతో 200 పుస్తకాలు అందించారు. ఈ సందర్భంగా సర్వోదయ గ్రంథాలయ నిర్వాహకులు డాక్టర్ ఆచార్య అవుటి జగదీష్ మాట్లాడుతూ.. యువత సమయం వృథా చేసుకోకుండా పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించుకోవాలని, పాఠశాల, కళాశాలల విద్యార్థులు సైతం గ్రంథాలయానికి రావాలని కోరారు.

భగవద్గీత మానవ జీవనానికి దిక్సూచీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న త్రైత సిద్ధాంత ప్రభోద సేవాసమితి సభ్యులు

నర్వ: భగవద్గీత మానవజీవనానికి దిక్సూచీ అని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక మక్తల్ కమిటీ అధ్యక్షుడు ఈశ్వరయ్య అన్నారు. ఆదివారం సాయంత్రం కల్వాల్‌లో సేవా సమితి ఆధ్వర్యంలో భగవద్గీత పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భగవద్గీతలోని 16వ, శ్లోకం, క్షర పురుషుడు అని జీవాత్మ గురించి, అక్షర పురుషుడ అని ఆత్మ గురించి, 17వ, శ్లోకంలో పురుషోత్తముడు అని పరమాత్మ గురించి చెప్పారన్నారు. జీవాత్మ, ఆత్మ, పరమాత్మ, అనే మూడు శ్లోకాలు, మూడు ఆత్మలు ఆధ్యాత్మికంలో ముఖ్యమైనవన్నారు. త్రైతసిద్ధాంత ప్రబోధసేవా సమితి ఆధ్వర్యంలో భగవద్గీత గురించి ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కృష్ణయ్య, తిరుపతయ్య, రాధిక, అనంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత చదవాలి

కొత్తకోట రూరల్: ప్రతి ఒక్కరూ త్రైత సిద్ధాంత భగవద్గీతను చదవాలని ప్రభోద సేవాసమితి సభ్యులు విజయభాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలో దండుగడ్డవీధి, హైస్కూల్ ఏరియాలో త్రైత సిద్ధాంత గ్రంథాల గురించి కాలనీ వాసులకు వివరించారు. కార్యక్రమంలో మహేశ్వరి, పద్మ, వేణు, భాస్కర్‌రెడ్డి, రాములు, రవి, శివ జహంగీర్, పురుషోత్తం, బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం



కనిమెట్టలో చెక్కును అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

కొత్తకోట రూరల్: పార్టీ కోసం పనిచేసిన, సభ్యత్వం కలిగి ఉండి ప్రమాదాల్లో చనిపోయిన ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త, కుటుంబానికి అండగా ఉంటామని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కనిమెట్టకు చెందిన బోయ భాస్కర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అదేవిధంగా అమడబాకుల చెందిన శ్యాంసుందర్‌రెడ్డి భవనంపై నుంచి ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందాడు. బోయభాస్కర్, శ్యామ్ సుందర్‌రెడ్డి బీఆర్ఎస్ సభ్యత్వం కలిగి ఉండటంతో బీఆర్ఎస్ చేసిన ఇన్సూరెన్స్ ద్వారా ఇద్దరికి వేర్వేరుగా రూ.2లక్షల చెక్కులు మంజూరయ్యాయి. చెక్కులను ఆదివారం మాజీ ఎమ్మెల్యే కనిమెట్ట, అమడబాకులకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మ న్ వామన్‌గౌడ్, ఎంపీపీ గుంత మౌనిక, ప్రశాంత్, విశ్వేశ్వర్, మల్లేష్, జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు జీరో బిల్లులు ఇవ్వాలి

మరికల్: మండలంలోని అర్హులైన వారందరికీ గృహజ్యోతి పథకం కింద జీరో బిల్లులను అమలు చేయాలని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ తర్వాత అమలు చేసిన జీరో బిల్లును మండలంలో 50శాతం మందికి కూడా అమలు కాలేదన్నారు. కొందరికి మాత్రమే జీరో బిల్లు అమలు కావడంతో మిగితా గృహ వినియోగదారులు విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి రావడంతో వారు ప్రభుత్వ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఎల్‌ఓసీ అందజేత

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని చందాపూర్ చెందిన నాగేంద్రమ్మ హైదరాబాద్‌లో అనారోగ్యంతో చికిత్స పొందుతుంది. ఈమె కు రూ.1.10 లక్షల ఎల్‌ఓసీ మంజూరైంది. దీన్ని ఆదివారం హైదరాబాద్‌లో కుమారుడికి అందజేశారు.